సాక్షి
కుమురం భీం
ఆదివారం ¦ 10 ¦ ఆగస్టు ¦ 2025



తండాల్లో తీజోత్సవం
'గిరి' గ్రామాల్లో తీజ్ సందడి మొదలైంది. పెళ్లి కాని యువతులు తమ ఆకాంక్షలు నెరవేరాలని తొమ్మిదిరోజులపాటు ఆటపాటలు, వినూత్న ఆచారాలతో వేడుక జరుపుకొంటారు. 8లో▸



ఘనంగా రక్షాబంధన్
అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. సోదరులకు సోదరీమణులు రాఖీ కట్టి స్వీట్ తినిపించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /24.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆదివాసీల అభివృద్ధికి కృషి



నివాళులర్పిస్తున్న సుగుణ, ఆదివాసీలు

కెరమెరి: కాంగ్రెస్ ఆదివాసీల అభివృద్ధికి కట్టుబడి ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని జోడేఘాట్‌లో నిర్వహించిన ఆదివాసీ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఆదివాసీల హక్కులు, సంప్రదాయాల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఆదివాసీల భూములు, అటవీ హక్కులు, జీవన విధానం కాపాడడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గిరిజనుల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని చెప్పారు. అంతకుముందు కుమురంభీం సమాధిపై పూలు చల్లి నివాళులర్పించారు. కుమురంభీం మనుమడు కుమురం సోనేరావు, మాజీ ఎంపీపీ అబ్దుల్ కలాం, నాయకులు పెందోర్ రాజేశ్వర్, కోవ ఇందిర, యశోద, సుజాయత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

రెబ్బెన: సింగరేణి ఆధ్వర్యంలో తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగరేణి పరిసర ప్రాంతాల నిరుద్యోగులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియా పరిసర ప్రాంత సింగరేణి సేవా సమితి సభ్యులు, స్వశక్తి సంఘాల మహిళలు నిరుద్యోగ యువతీయువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 12న సాయంత్రం 5లోపు గోలేటిలోని జనరల్ మేనేజర్ కార్యాలయం పర్సనల్ డిపార్టుమెంట్‌లో లిఖితపూర్వక దరఖాస్తులు అందించాలని, పూర్తి వివరాలకు 99512 14116 లో సంప్రదించాలని సూచించారు.

అటవీ భూముల్లో అక్రమసాగు



మాట్లాడుతున్న సుశాంత్ సుఖ్‌దేవ్‌బొబడే

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ అటవీ డివిజన్ రేంజ్ పరిధిలోని కర్జెల్లి బీట్‌లో రెండువేల ఎకరాల అటవీ భూమిని అక్రమంగా సాగు చేస్తున్నట్లు గుర్తించామని కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో సుశాంత్ సుఖ్‌దేవ్ బొబడే తెలిపారు. శనివారం కాగజ్‌నగర్ డివిజన్ ఫారెస్ట్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. కర్జెల్లి బీట్ పరిధిలో 350 కుటుంబాలు అటవీభూమిని అక్రమంగా సాగు చేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. కర్జెల్లి రేంజ్‌లోని ఎనిమిది కుటుంబాలవారు 150 ఎకరాలు, మరో ఎనిమిది కుటుంబాల వారు 74, 44 కుటుంబాల వారు 244, 16 కుటుంబాల వారు 472, 14 కుటుంబాలవారు 632, మరో ఇద్దరి వద్ద 34 ఎకరాల అటవీభూమి అక్రమంగా సాగులో ఉందని తెలిపారు. అక్రమంగా సాగు చేసుకుంటున్న వారితో సమావేశాలు నిర్వహించి విచారణ చేపట్టి ఒక్కొక్కరికి మూడెకరాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కర్జెల్లి ఎఫ్‌ఆర్వో సుభాష్ ఉన్నారు.

కూలిన వంతెన పరిశీలించిన ఎమ్మెల్యే

ఆసిఫాబాద్: మండలంలోని మాలన్‌గొంది గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిన బ్రిడ్జిని ఎమ్మెల్యే కోవ లక్ష్మి శనివారం పరిశీలించారు. వంతెన కూలడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన 52 మేకలు చనిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూలిన బ్రిడ్జి ప్రాంతాన్ని సందర్శించారు. వెంటనే మరమ్మతు పనులు ప్రారంభించి రాకపోకలు పునరుద్ధరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆమె వెంట సింగిల్‌విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ సర్పంచ్ తిరుపతి, రవీందర్ తదితరులున్నారు.

గిరిజనులపై దాడి హేయనీయం

ఆసిఫాబాద్: ఆదివాసీ గిరిజనులపై అటవీశాఖ అధికారులు దాడి చేయడం హేయమైన చర్య అని మాజీ ఎంపీ సోయం బాపూరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో శనివారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. మంచిర్యాల జిల్లా జన్నారంలో ఆదివాసీలపై అటవీశాఖ అధికారులు దాడి చేసి, అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. ఆదివాసీలపై అటవీశాఖ అధికారులు దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రతిదాడులు చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీలు ఐక్యంగా ఉంటూ జీవో 49 రద్దుకోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈఎస్ఐ, ఈపీఎఫ్ హాంఫట్!



విధులు బహిష్కరించి కాగజ్‌నగర్ సీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు (ఫైల్)



తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు (ఫైల్)

- మూడేళ్లుగా జమ చేయని కాంట్రాక్టర్
- నాలుగు నెలల వేతనాలు పెండింగ్
- ఆగస్టులో ముగుస్తున్న కాంట్రాక్ట్ గడువు
- ఆందోళనలో వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

కాగజ్‌నగర్ టౌన్: జిల్లాలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు మూడేళ్లుగా కాంట్రాక్టర్ ఈఎస్ఐ, పీఎఫ్ వాటా జమ చేయడంలేదు. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడంలేదు. దీంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, బెజ్జూరు, సిర్పూరు(టి), వాంకిడి, తిర్యాణి, జైనూర్ ఆస్పత్రుల్లో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ విభాగాలు, స్వీపర్లు, అటెండర్లుగా 100 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. వీరు 2022లో భీం సొసైటీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ కింద విధుల్లో చేరారు. అప్పటినుంచి విధులు నిర్వహిస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్ శ్రీకాంత్ వీరి వేతనాల్లో కోత పెట్టిన డబ్బులు ఈఎస్ఐ, పీఎఫ్ వాటా చెల్లించడంలేదు. ఆస్పత్రి అధికారులతో కుమ్మక్కై ఉద్యోగులు వాటా సొమ్ము కాజేశారనే ఆరోపణలున్నాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు, ఇటీవల వచ్చిన తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి కింది స్థాయి సిబ్బందికి ఎప్పటికప్పుడు వేతనాలు అందిస్తున్నట్లు చెప్పారు. సంబంధిత సూపరింటెండెంట్ చెన్నకేశవ్‌ను మందలించారు. కాంట్రాక్టర్ మూడేళ్లుగా ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించకుండా ఉంటే అతడిపై చర్యలు తీసుకోవడంలేదని నిలదీశారు. అయితే వీరిద్దరి మధ్య ఒప్పందం కుదిరిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్ గడువు ఈ నెలతో ముగియనుండగా 'కోత'ల వివాదం సమసి పోతుందనే భావనలో ఉన్నట్లు కార్మికులు వాపోతున్నారు.

అధికారులకు తెలిపినా అంతే..



భీం సొసైటీ ద్వారా విధులు నిర్వహిస్తున్న. ఈఎస్ఐ, పీఎఫ్ వాటా ఎగ్గొడుతున్న కాంట్రాక్టర్‌పై అధికారులకు తెలిపినా ఫలితం లేకుండా పోయింది. అధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కయినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు మా సమస్య పరిష్కరించాలి
– ఇమ్రాన్, సెక్యూరిటీ, కాగజ్‌నగర్

కుమ్మక్కై నష్టం జేస్తున్నరు



కాంట్రాక్టర్, సూపరింటెండెంట్ కుమ్మక్కయ్యారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో శానిటేషన్, స్వీపర్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బందికి మూడేళ్లుగా ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లిస్తలేదు. ఉన్నతాధికారులకు తెలిపినా స్పందించలేదు. వైద్య విధాన పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.
– బోగె ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఇబ్బంది పడాల్సి వస్తోంది



నాలుగు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మాకు జరుగుతున్న అన్యాయాన్ని ఎవరికి చెప్పినా పట్టించుకోవడంలేదు. ఆస్పత్రిలో డ్యూటీ చేసినా ఫలితం లేకుండా పోతోంది. సంబంధిత ఏజెన్సీ వారిని అడిగితే డబ్బులు రాలేదని చెబుతున్నారు.
– నరేశ్, సెక్యూరిటీ, కాగజ్‌నగర్ సీహెచ్‌సీ

అధికారులే దయ చూపాలే



రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం మాది. నాకు ముగ్గురు ఆడపిల్లలున్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నం. మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బంది పడాల్సి వస్తోంది. అధికారులే దయ చూపి సమస్య పరిష్కరించాలి.
– భాగ్య, స్వీపర్, కాగజ్‌నగర్

చర్యలు తీసుకోవాలి



ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలందిస్తున్నాం. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా కంటికి రెప్పలా చూసుకుంటున్న మాపై అధికారులు దయ చూపాలి. వెంటనే స్పందించి మా వేతనంలో కోత పెట్టిన ఈఎస్ఐ, పీఎఫ్ వాటా సొమ్ము చెల్లించేలా చర్యలు చేపట్టాలి.
– తిరుమల, పేషెంట్ కేర్, కాగజ్‌నగర్

ఆదివాసీల అభివృద్ధికి నిరంతర కృషి



ఆసిఫాబాద్: విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి
- ఘనంగా ఆదివాసీ దినోత్సవం



కుమురంభీం చౌక్ వద్ద నినదిస్తున్న అదనపు కలెక్టర్, ఆదివాసీ సంఘాల నాయకులు

ఆసిఫాబాద్: ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతర కృషి చేస్తోందని అదనపు కలెక్టర్ దీపక్ తివారి పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఎస్పీ కాంతిలాల్ సుభాష్ పాటిల్, జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి రమాదేవితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదివాసీ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని సూచించారు. జల్, జంగల్, జమీన్ కోసం పోరాటం చేసిన కుమురంభీం స్ఫూర్తిగా ఆదివాసీలు ముందుకు సాగాలని తెలిపారు. అధికారుల సమన్వయంతో సంపూర్ణతా అభియాన్‌కింద ఎంపికైన తిర్యాణి మండలం రెండుసార్లు జాతీయ అవార్డు కైవసం చేసుకున్నట్లు గుర్తు చేశారు. జీవో 49 రద్దు దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఆదివాసీల అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత నివారణకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు. విద్యాభివృద్ధిలో భాగంగా అదనపు తరగతి గదులు నిర్మించి గిరిజన పిల్లలకు గుణాత్మక విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాకు నూతన వసతి గృహాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. వైద్యాభివృద్ధికోసం నూతన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఎస్పీ కాంతిలాల్ పాటిల్ మాట్లాడుతూ.. పోలీస్‌శాఖ ఆదివాసీలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఆదివాసీల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు శివాజీ చౌక్ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి అంబేడ్కర్ చౌక్‌లోని అంబేడ్కర్, కుమురంభీం చౌక్‌లోని కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డప్పుచప్పుళ్లు, గుస్సాడీ నృత్యాలతో ఆదివాసీ భవన్‌కు చేరుకున్నారు. ఆదివాసీ జెండాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులు ఆదివాసీ గీతాలపై చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సీతారాం, ఎఫ్‌డీవో దేవిదాస్, గోండ్వానా మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు అర్జు, జీసీడీవో శకుంతల, గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఏసీఎం ఉద్దవ్, జిల్లాలోని తొమ్మిది ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తుడుందెబ్బ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఆదివాసీ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ అభివృద్ధికి తోడ్పడుతున్న అధికారులు, సంఘాల నాయకులను అభినందించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే దుస్తులు ధరించి నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. కుమురంభీం, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ నాయకులకు ఎమ్మెల్యే రాఖీ కట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నాయకురాలు మర్సకోల సరస్వతి, తుడుందెబ్బ నాయకులు బుర్స పోచయ్య, కొట్నాక విజయ్‌కుమార్, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆదివాసీల్లో చైతన్యం తేవాలి



నివాళులర్పిస్తున్న బాపూరావు, నాయకులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల్లో చైతన్యం నింపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంపీ, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు సూచించారు. శనివారం మండలంలోని జోడేఘాట్‌లో కుమురంభీం విగ్రహానికి పూలమాల వేసి, భీం సమాధిపై పూలు చల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆదివాసీ చట్టాల అమలు కోసం పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రావు, సెడ్మకి ఆనంద్‌రావు, పెందోర్ రాజేశ్వర్ తదితరులున్నారు.

పనులు వేగవంతం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఇందిరా సౌర గిరిజన వికాసం పనులు వేగవంతం చేయాలని, సోలార్ విద్యుత్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కేబినెట్ విధాన నిర్ణయం తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మల్లు రవి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్వోఎఫ్ ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం అమలుపై కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని కలెక్టరేట్, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్‌లను హైదరాబాద్‌కు పంపాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌లు అన్నీ ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన డిజైన్‌లు హైదరాబాద్ నుంచి పంపిస్తామని తెలిపారు. కలెక్టర్ కార్యాలయాల్లో మంచి డిజైన్‌లు ఉంటే ఆయా కలెక్టర్లు హైదరాబాద్‌కు పంపవచ్చని సూచించారు. గ్రామపంచాయతీ భవనం నుంచి సెక్రటేరియేట్ వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుపై ఒక ప్రశ్నావళిని పంపిస్తామని తెలిపారు. అందులో పూర్తి వివరాలు నమోదు చేసి వారంలోపు విద్యుత్ శాఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ప్రభుత్వ భవనాలతో పాటు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపై కూడా సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, అందుకు భవనాల వివరాలు పంపాలని పేర్కొన్నారు. నీటిపారుదల, రోడ్డు భవనాల శాఖల పరిధిలో పెద్ద మొత్తంలో ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటి వివరాలు కూడా పంపాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్వోఆర్ఎఫ్ చట్టం కింద 6.70లక్షల ఎకరాల భూములను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిందని, సదరు భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరిజన వికాసం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. నల్లమల డిక్లరేషన్‌లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ప్రారంభించామని, నెలలో ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. కలెక్టర్లు అలసత్వం ప్రదర్శించకుండా వారంలోపు వివరాలు పంపాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్ పాల్గొన్నారు.

ఐదు వారాలైనా పైసలు రాలే..



రెబ్బెన మండలం గోలేటిలో ఉపాధి పనుల్లో కూలీలు (ఫైల్)

- నిలిచిన ఉపాధిహామీ వేతనాలు
- పెండింగ్‌లో రూ.15.08 కోట్లు
- ఇబ్బందులు పడుతున్న కూలీలు

తిర్యాణి: దారిద్య్ర రేఖకు దిగువనున్నవారికి ఉపాధి కల్పించాలని 2005లో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఏడాదికి ఒక్కో కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పిస్తోంది. చేసిన పని ఆధారంగా గరిష్టంగా ఒక్కొక్కరికి రోజుకు రూ.304 చొప్పున చెల్లిస్తున్నారు. ఈ పథకం ప్రారంభంలో కూలీలకు ఎంతగానో ఉపయోగపడింది. తదనంతరం పథకంలో మార్పులు చేయడం.. ఇందులోని నిబంధనలకు లోబడి వేతనాలు సరైన సమయంలో విడుదల చేయకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఉపాధిహామీ కింద 1.23లక్షల జాబ్‌కార్డులుండగా అందులో 2.43 లక్షల మంది కూలీలు సభ్యత్వం కలిగి ఉన్నారు. ఇందులో 91వేల జాబ్ కార్డులు యాక్టీవ్‌లో ఉండగా 1.70 లక్షల మంది కూలీలు నిత్యం పనులకు వెళ్తున్నారు.

నిలిచిన వేతనాలు

ఉపాధిహామీ చట్టం ప్రకారం కూలీలు పని చేసిన 21 రోజుల్లోనే వేతనాలు చెల్లించాలి. కానీ, గత మే మొదటి వారం నుంచి ఇప్పటివరకు కూలీలకు వేతనాలు అందలేదు. జూన్‌తోనే దాదాపు అన్ని చోట్ల ఉపాధి పనులు ముగుస్తుంటాయి. తిరిగి నవంబర్ నుంచి ప్రారంభమవుతుంటాయి. అయితే పనులు పూర్తయి దాదాపు రెండు నెలలైనా నేటికీ (2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి) జిల్లాలో రూ.15.08 కోట్ల కూలీల వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వానాకాలం పంటల సాగు ముగిశాక రైతు కూలీలకు పని దొరకకపోవడంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు ఆసక్తి కనబరిచారు. అయితే ఒక్కో కూలీకి సంబంధించి దాదాపు ఐదు వారాల వేతనాల చెల్లింపులు నేటికీ పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో కూలీలు కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఎక్కువగా కూలీలకు సంబంధించి పోస్టాఫీస్ ఖాతాల్లోనే వేతనాలు జమ అవుతుంటాయి. దీంతో వేతనాలు వచ్చాయో.. లేదో.. తెలియక కూలీలు నిత్యం పోస్టాఫీసుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

పోస్టాఫీస్ చుట్టూ తిరుగుతున్న



వానాకాలం సీజన్ ముగిశాక వ్యవసాయ పనులేవీ లేక ఉపాధిహామీ పనులకు పోయిన. పని చేసి ఐదు వారాలవుతున్నా ఇంకా పైసలు ఖాతాలో పడలేదు. పైసలు పడ్డయో.. లేదో తెలుసుకునేందుకు వారానికి రెండుసార్లు పోస్టాఫీస్ చుట్టూ తిరుగుతున్న.
– విజయ, ఉపాధి కూలీ, గోలేటి, రెబ్బెన మండలం

వెంటనే వేతనాలు చెల్లించాలి



ఉపాధిహామీ పనులకు సంబంధించి కూలీలకు వేతనాలు పెండింగ్ ఉండటంతో చాలా కష్టమవుతోంది. వేతనాలు ఎప్పుడు వస్తాయోనని ఉపాధిహామీ సిబ్బందిని అడిగితే ఎవరూ సరైన సమాధానం ఇవ్వడం లేదు. వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేసి ఆదుకోవాలి.
– దుర్శెట్టి సతీశ్, తిర్యాణి

'కూపన్ల బాధ్యత ఇవ్వకుంటే రాజీనామా'



మాట్లాడుతున్న పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు

కాగజ్‌నగర్ టౌన్: ఎరువులు, యూరియా పంపిణీ చేసేందుకు జారీ చేసే కూపన్ల బాధ్యత తమకు ఇవ్వకుంటే రాజీనామా చేస్తామని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ ఉమామహేశ్వర్‌రావు పేర్కొన్నారు. శనివారం పీఏసీఎస్ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎరువుల పంపిణీ కూపన్లను వ్యవసాయాధికారులు పంచడమేమిటని ప్రశ్నించారు. గత కొన్నేళ్లుగా పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు, యూరియా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయాధికారులు రైతులకు పంటలపై సూచనలు, సలహాలు చేస్తూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కానీ, రైతువేదికల్లో ఉండి రైతులకు కూపన్లు పంపిణీ చేయడం సరికాదని పేర్కొన్నారు. వ్యవసాయాధికారులు ఇష్టం వచ్చిన వారికి కూపన్లు అందజేస్తున్నారని ఆరోపించారు. దీంతో అసలైన రైతులకు ఎరువులు అందక నానా ఇబ్బంది పడాల్సి వస్తోందని తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రావు, నగునూరి తిరుపతి, దరిణి రాములు, కెకరి నానాజీ, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్టాండ్లలో రాఖీ రద్దీ



కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ బస్టాండ్‌లో ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సు

ఆసిఫాబాద్: రాఖీ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిపోయే ప్రయాణికులతో కిటకిటలాడింది. ఇదే సమయంలో అద్దె బస్సు డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండుగంటల పాటు బస్టాండ్ వద్ద నిరసన తెలుపగా మరింత రద్దీ పెరిగింది. డీఎం రాజశేఖర్ కల్పించుకుని పండుగపూట నిరసన తెలుపడం సరికాదని, సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇవ్వగా వారు ఆందోళన విరమించారు. రాఖీ సందర్భంగా హైదరాబాద్‌కు ఒక సూపర్ లగ్జరీ బస్సు, మూడు ఎక్స్‌ప్రెస్‌లు అదనంగా నడుపుతున్నట్లు ఈ సందర్భంగా డీఎం తెలిపారు.

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ బస్టాండ్ శనివారం మహిళా ప్రయాణికులతో కిటకిటలాడింది. కాగజ్‌నగర్ నుంచి మంచిర్యాల, కౌటాల, బెజ్జూరు, ఆసిఫాబాద్, పెంచికల్‌పేట్ తదితర ప్రాంతాలకు వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. బస్సులు ఎక్కే క్రమంలో తోపులాటలు కూడా జరిగాయి. ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల్లోనూ రద్దీ కనిపించింది.

తండాల్లో తీజోత్సవం

- గిరిజన గ్రామాల్లో మొదలైన సందడి
- పెళ్లికాని యువతులు నిర్వహించే పండుగ


గోధుమ నారుకు నీళ్లు చల్లుతున్న యువతులు

కెరమెరి : తీజ్.. గిరిజన తండాల్లో తేజాన్ని నింపే పండుగ. గిరిజన యువతులు తమ ఆశలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ తొమ్మిది రోజుల పాటు ఉత్సాహంగా నిర్వహించుకునే ఉత్సవం. ఆటపాటలు, విందులు, వినోదాలు, వినూత్న ఆచారాలతో బతుకమ్మ తరహాలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగే ఈ వేడుకలు గిరిజన బంజారా (లంబాడా) తండాల్లో రక్షాబంధన్‌కు ప్రారంభమై కృష్ణాష్టమికి ముగుస్తాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శనివారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

వేడుకల్లో నిమగ్నం..

గిరిజన లంబాడాలు తమ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా పండుగలు జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాఖీ పౌర్ణమి నుంచి లంబాడా గిరిజనులంతా 'తీజ్' పండుగ జరుపుకోవడంలో నిమగ్నమయ్యారు. యువతులు కుల దేవతలను కొలుస్తూ బుట్టల్లో ఎర్రమట్టి నింపి అందులో గోధుమలు చల్లారు. వీటినే తీజ్ బుట్టలు అంటారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని 'తీజ్ భరాయిరో' అని పిలుస్తారు. ఆ రోజు నుంచి యువతులంతా నియమ నిష్టలు పాటిస్తున్నారు. గ్రామ ప్రజలకు మంచి జరగాలని, తమకు మంచి భర్త రావాలని కోరుకుంటూ ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ప్రతీరోజు మూడు పూటలా సమీపంలోని బావుల వద్దకు వెళ్లి నీటిని తీసుకువచ్చి బుట్టలపై చల్లుతున్నారు. ఆరు రోజులపాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

ఏడో రోజు 'ఢమోళీ' సందడి

ఏడో రోజున ప్రతీ ఇంట్లో బియ్యపు పిండితో రొట్టెలు చేస్తారు. వాటిని బెల్లం, నెయ్యితో కలుపుతారు. ఈ మిశ్రమాన్నే చూర్మా అంటారు. ఈ చూర్మాను తీజ్ బుట్టలున్న ఇంటి ఆవరణలో నెలకొల్పిన కుల దేవుడు 'సేవాభయ్య'కు నైవేద్యంగా సమర్పిస్తారు. అదే రోజు ఇంటి సింహద్వారానికి ఎదురుగా జొన్నలతో నింపిన గోనె సంచులు, వాటి ముందు నీళ్ల కడవ ఉంచి అందులో వేప మండలు పేరుస్తారు. ఆ కడవ ముందు జొన్నపిండితో ముగ్గులు వేస్తారు. వాటి మధ్య వెండితో తయారు చేసిన 'మేరామయాడి' తల్లి విగ్రహాన్ని ఉంచి దీపం వెలిగించి పూజలు చేస్తారు. మేరామయాడి దేవత మాంసాహారి కావడంతో ఆమెకు మేకపోతును బలిస్తారు. ఆరోజు రాత్రి యువతులు ఇంటింటికీ వెళ్లి చూర్మా సేకరిస్తారు. వర్షానే వారికి పూస్తూ నృత్యం చేయడంతో సందడి వాతావరణం నెలకొంటుంది. ఈ కోలాహల ప్రక్రియనే 'ఢమోళీ'గా వర్ణిస్తారు.

ఎనిమిదో రోజు 'ఘంగోర్' వివాహం

ఎనిమిదో రోజు యువతులంతా చెరువు వద్దకు వెళ్లి మట్టిని తీసుకొస్తారు. ఆ మట్టితో ఆడ, మగ బొమ్మలను తయారు చేస్తారు. ఆడ బొమ్మకు గాంగ్రి, మగ బొమ్మకు ధోవతి, లాల్చీతో వేషధారణ చేస్తారు. వాటిని మేళతాళాలతో తీజ్‌లు ఉన్న చోటుకు ఊరేగింపుగా తీసుకెళ్తారు. అక్కడ ఆ బొమ్మలకు ఘనంగా వివాహం జరిపిస్తారు. అక్కడే లాప్సీ (పాయసం) తయారు చేసి ఉత్సవ ప్రతిమలకు నైవేద్యంగా సమర్పిస్తారు. 'గణ' అంటే వారి కులదేవత 'మేరామయాడి' అని 'గోర్' అంటే కుల దేవుడు సేవాభయ్యా అని గిరిజనులు పిలుస్తుంటారు. వారిరువురికి ఈ రోజు పెళ్లి చేసినట్లు చెప్పుకుంటారు.

తొమ్మిదో రోజు..

తొమ్మిదో రోజును 'తీజ్ తోడేరో దాడో' అని పిలుస్తారు. ఆ రోజు యువతులంతా ఇంటింటికీ వెళ్లి తీజ్‌లను తెంపడానికి అందరూ రావాలని ఆహ్వానిస్తారు. వారంతా వచ్చిన తర్వాత మంచె పైనున్న తీజ్ బుట్టలను కిందికి దించుతారు. కులదేవతలను పూజిస్తూ 'తీజ్' నారును తెంపుతారు. దానిని వరుసగా కూర్చున్న మగవారి తలపాగలో పెడతారు. ఆడవారైతే కొంగుకు కట్టుకుంటారు. మరికొందరు ఇంటి గుమ్మానికి కడుతారు. అనంతరం జొన్నరొట్టెలు చేసి డప్పు వాయిద్యాలతో తీజ్ నిమజ్జనానికి బయలు దేరుతారు. సమీపంలోని చెరువులు లేదా బావుల్లో నిమజ్జనం చేస్తారు. ఈ రోజు ప్రక్రియను 'తీజ్ ఎరాయోరో' పిలుస్తారు. దీనిని ఒకరకంగా లంబాడీ బతుకమ్మగా కూడా భావిస్తారు. గోర్‌బంజారాలు నిర్వహించే ఈ పండుగలో వారి సంస్కృతి ఉట్టిపడుతుంది. పంచకట్టు, ఖమీజ్ రుపాట్ ధరించి పురుషులు, టుక్రి, కాంచ్లీ, చేతులకు బలియాలు వేసుకుని యువతులు, సంస్కృతికి తగ్గట్టుగానే తయారవుతారు. గడ్డి బతుకమ్మను తెచ్చి ఆడపడుచులు సోదరుల కాళ్లు కడుగుతారు. ఆపై పారే నీటిలో గడ్డి బతుకమ్మలను వదులుతారు.

సంతోషంగా..



శ్రావణమాసంలో నిర్వహించే తీజ్ పండుగంటే మాకు ఎంతో ఇష్టం. బుట్టల్లో ఉన్న గోధుమలకు తొమ్మిది రోజులు నీళ్లు చల్లి చివరి రోజు ఉత్సవం జరుపుకుంటాం. ఇలా జరుపుకోవడం వల్ల అన్నికార్యాలు సిద్ధిస్తాయని పెద్దలు చెబుతున్నారు. పాడి పంటలతో పాటు ఇంటిల్లిపాది, గ్రామస్తులు సుఖశాంతులతో ఉంటారు.

– జే.దివ్యరాణి, చందుగూడ, కెరమెరి

క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లతో ఎస్సై రాజేందర్

కోటపల్లి: మండలంలోని అంతర్రాష్ట్ర వంతెన సమీపంలోని ప్రాణహిత నదిలో నుంచి శనివారం తెల్లవారు జామున ఇసుక తరలిస్తున్న రెంటు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. వెలమపల్లికి చెందిన గోనె సత్యనారాయణ, మానిశెట్టి ప్రశాంత్‌తో పాటు డ్రైవర్లు అట్టెల వెంకటేశ్, జగన్‌పై కేసు నమోదు చేసి వాహనా లను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

సోన్: వృద్ధురాలిపై కోతులు దాడి చేసిన సంఘటన శనివారం మండలంలోని న్యూ వెల్మల్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గోపు సాయవ్వ తన ఇంటి ముందు నిద్రపోతుండగా కోతులు ఒక్కసారిగా దాడి చేయడంతో తల, మెడపై గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్‌లోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోతుల బారి నుండి తమను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మి వాడకు చెందిన యువతి (25) తల్లి మందలించడంతో శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో ఆమె తండ్రి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీలో వ్యభిచారం గృహంపై శనివారం దాడి చేసినట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. మహారాష్ట్రకు చెందిన చేతన్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీలో ఓ ఇంటిని కొన్ని నెలల క్రితం నుంచి అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆ ఇంటికి పలువురు పురుషులు, మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో అనుమానం కలిగిన కాలనీ వాసులు ఫిర్యాదు చేయడంతో ఆ గృహంపై దాడి చేసి చేతన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఆటో


చెట్ల పొదల్లో ఆటో

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని హరిత వనం పార్కు సమీపంలో చెట్ల పొదల్లోకి ఆటో దూసుకెళ్లి బోల్తా పడింది. సిర్పూర్ మండలం చిలాటిగూడకు చెందిన ప్రయాణికులు మహారాష్ట్రలోని మహుర్ గ్రామానికి దైవదర్శనం కోసం ఆటోలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శనివారం మావల సమీపంలో ఆటో చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న దేవ్‌రావు, మారుతి, మంగావతి, నాగోబాయికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఈఎంటీ కిషన్, పైలట్ ముజఫర్ క్షతగాత్రులను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఈవో కార్యాలయం ప్రారంభం


కార్యాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

బాసర: బాసర ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయాన్ని శనివారం అధికారికంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో గోమాతతో భవన ప్రవేశం, వాస్తుపూజ, మహా హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేటి నుంచి నూతన కార్యాలయంలో అధికారులంతా విధులు నిర్వహిస్తారని ఆలయ ఏఈవో సుదర్శన్ గౌడ్ తెలిపారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, ఆలయ సీనియర్ అసిస్టెంట్లు, పీఆర్వో నారాయణ పటేల్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం..

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణంలోని దస్నాపూర్ కాలనీలో శుక్రవారం రాత్రి కొండచిలువ కనిపించడంతో భయాందోళన చెందిన స్థానికులు జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అధికారి సిబ్బందిని అప్రమత్తం చేసి కాలనీకి పంపించారు. జిల్లా అటవీశాఖ అధికారి సీసీ ఇసాక్ ఆధ్వర్యంలో బీట్ అధికారులు కిషోర్, ఎం.వెంకటేష్, మారుతి, పి.వెంకటేష్ గంటపాటు శ్రమించి దానిని ఒక సంచిలో బంధించి అటవీప్రాంతంలో వదిలేశారు. సమయానికి స్పందించిన అటవీ శాఖ అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

కంటెయినర్‌ను ఢీకొని యువకుడి మృతి

- రాఖీ కట్టించుకొని ఇంటికి వస్తుండగా ప్రమాదం
- బాసరలో పండుగపూట విషాదం


సాయిబాబు (ఫైల్)

బాసర/నవీపేట: రాఖీ పండుగను పురస్కరించుకుని ఓ సోదరుడు అక్కతో రాఖీ కట్టించుకొని స్కూటీపై తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం అబ్బాపూర్(ఎం) శివారులో చోటు చేసుకుంది. ఎస్సై వినయ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా బాసరకు చెందిన వర్గంటి సాయినాథ్, కవిత దంపతులకు కుమార్తె సాయిప్రియ, కుమారుడు సాయిబాబు అలియాస్ బబ్లూ (19) ఉన్నారు. రాఖీ పండుగ సందర్భంగా శనివారం బబ్లూ నిజామాబాద్‌లోని గాజుల్‌పేట్‌లో ఉంటున్న కవిత వద్దకు చిన్నాన్న కుమారుడైన అరవింద్‌తో కలిసి స్కూటీపై వెళ్లాడు. అక్కతో రాఖీ కట్టించుకొని తిరిగి వస్తుండగా అబ్బాపూర్(ఎం)–జగ్గారావు ఫారమ్ మధ్యలో ముందుగా వెళ్తున్న కంటెయినర్‌ను ఓవర్ టేక్ చేస్తూ వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ఘటనలో బబ్లూ కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అరవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి మేనమామ బలగం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రాఖీ కట్టించుకునేందుకు వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నిర్మల్‌రూరల్: చెల్లితో రాఖీ కట్టించుకునేందుకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల మేరకు లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లీకి చెందిన మహేష్ తనకు వరుసకు చెల్లెళ్లు అయిన అర్చన, ఆద్యతో కలిసి జిల్లా కేంద్రంలోని సోఫినగర్ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న అర్చన చెల్లెలు అక్షయతో రాఖీ కట్టించుకునేందుకు బైక్‌పై బయలుదేరారు. చిట్యాల వద్ద గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. ముగ్గురు ఎగిరి కిందపడడంతో మహేష్, అర్చనకు తీవ్రంగా ఆద్యకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా అందుబాటులో లేకపోవడంతో ట్రాలీలో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అర్చన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాలలో శోధిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విషయం తెలుసుకుని..దాతృత్వం చాటి..


రక్తదానం చేస్తున్న సాయిరాహుల్


నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ రూరల్ మండలం చిట్యాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన అర్చనను జిల్లా కేంద్రంలోని దేవేందర్ రెడ్డి ఆస్పత్రిలో చేర్పించారు. తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం జరగడంతో 'ఎ' నెగిటివ్ రక్తం అవసరమైంది. అరుదుగా లభించే ఈ రక్తగ్రూపు కోసం సామాజిక మాధ్యమాల్లో చేరవేయగా విషయం తెలుసుకున్న జిల్లా కేంద్రానికి చెందిన బండారి సాయిరాహుల్ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశాడు. సమయానికి రక్తదానం చేసిన యువకుడిని పలువురు అభినందించారు..

నిర్మలం.. హృదయ రంజితం


గండిరామన్న హరిత పార్కు చుట్టూ పచ్చదనంతో అటవీ ప్రాంతం

ప్రకృతి శోభకు పెట్టింది పేరు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా. నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలోని ఈ అడవుల్లో ఉన్న చెట్లకు ఇటీవల కురిసిన వర్షాలకు పచ్చగా ఆకులు చిగురించి ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచుతున్నాయి. నిర్మల్ జిల్లా పరిసరప్రాంతాల ప్రజల హృదయాలను రంజింపజేస్తున్న ఈ ప్రకృతి చిత్రాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

జిల్లా కేంద్రం శివారులో పచ్చదనంతో అటవీ ప్రాంతం



ఆదివాసీ సంప్రదాయాలు భావితరాలకు అందించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- అధికారికంగా ఆదివాసీ దినోత్సవం


భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ


డప్పుచప్పుళ్లతో కలెక్టర్, ఎస్పీకి స్వాగతం పలుకుతున్న ఆదివాసీలు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉట్నూర్‌లోని కుమురం భీం కాంప్లెక్స్‌లో ఉన్న సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అధికారిక వేడుకలకు హాజరయ్యారు. ముందుగా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ కాజల్ సింగ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీతో కలిసి భీం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని, ప్రపంచ ప్రసిద్ధి పొందాయన్నారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా పీవీటీజీ గిరిజనులు, ఒంటరి మహిళలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. ప్రధాన మంత్రి జన్ మన్ పథకం ద్వారా 180 అంబులెన్స్‌లను పీవీటీజీ గ్రామాల్లో ఏర్పాటు చేశామన్నారు. పీవో మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పీవీటీజీ గిరిజనులకు ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా విద్య, వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆదివాసీల సంప్రదాయ బద్ధమైన పూజలు, గుస్సాడీ నృత్యాలు, డోలు వాయిద్యాలతో కుమురంభీం ప్రాంగణం హోరెత్తింది. ఈ కార్యక్రమంలో ఏపీవో మెస్రం మనోహర్, పేసా కోఆర్డినేటర్ వసంత్‌రావు, సర్‌మేడీలు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ఆదివాసీలు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో..

మండల కేంద్రంతో పాటు ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఆదివాసీలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆదివాసీ నాయకులు కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన మోర సాయి (32) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. రాఖీ పండుగ సందర్భంగా రెండు రోజుల క్రితం అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచార నిందితుడి గాలింపునకు ప్రత్యేక బృందాలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీచౌక్‌లో 78 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడి కోసం వన్ టౌన్ పోలీసులు ప్రత్యేక గాలింపు చర్యలు చేపడుతున్నారు. మహారాష్ట్ర వాసిగా అనుమానిస్తున్న నిందితుడు తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో రైల్వే స్టేషన్ వైపు వెళ్లి ట్రెయిన్‌లో పరారైనట్లుగా పోలీసులు భావిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. సీసీ పుటేజీలో నిందితుడి కదలికలను గమనించినట్లుగా ఆయన పేర్కొన్నారు

నాగోబాకు నొవోంగ్ పూజలు


పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా మురాడి వద్ద మెస్రం వంశీయులు శనివారం నొవోంగ్ పూజలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన మెస్రం వంశ పెద్దలు ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన చిరు ధాన్యాలతో నైవేద్యం తయారుచేసి నాగోబాకు సమర్పించారు. అనంతరం తమ గ్రామాలకు వెళ్లి నొవోంగ్ పూజలు చేయనున్నట్లు తెలిపారు. నొవోంగ్ పూజల చేస్తేనే ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన చిరుధాన్యాలను తెంపడం జరుగుతుందని మెస్రం వంశ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం వంశ పెద్దలు కోసేరావ్, హనుమంత్‌రావ్, దేవ్‌రావ్, లింబారావు, నాగ్‌నాథ్, ఆనంద్‌రావ్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే కార్మిక సమస్యలు పరిష్కారం

- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

రెబ్బెన: పోరాటాల ద్వారానే సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బెల్లంపల్లి ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఇప్పటి వరకు డైరెక్టర్ స్థాయి అధికారులతో కమిటీ సమావేశాలు జరిపినా కార్మికులకు సంబంధించిన ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని, కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. సొంతింటి పథకం అమలు, ఆదాయపు పన్ను మాఫీ వంటి దీర్ఘకాలిక సమస్యలను ఎన్నికల్లో గెలిచిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఎన్నికై 18 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. యాజమాన్యంతో ములాఖత్ అయి కార్మికులకు తీరని ద్రోహం చేస్తున్నారని, ఇచ్చిన హామీలపై గనులపై నిలదీయాలని పిలుపునిచ్చారు. జూలై 31న జరిగిన మెడికల్ బోర్డులో కార్మికులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కార్మికులందరికి రీ మెడికల్ నిర్వహించి అన్‌ఫిట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి తిప్పారపు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, ఏరియా కార్యదర్శి శివారెడ్డి, ఏరియా ఆర్గనైజర్లు ఎస్కే ఇనాస్, మరిశెట్టి దత్తు, పిట్ కార్యదర్శి ఎండీ ఆరీఫ్, ఖైరిగూడ పిట్ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు తిరుపతి, బాలేష్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

కడెంకు స్వల్ప ఇన్‌ఫ్లో



కడెం ప్రాజెక్ట్‌కు శనివారం 1,707 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చినట్లు ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 696.200 అడుగుల వద్ద నీటిమట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. – కడెం